# సినిమా సాయం

వాంటింటిలో కూచుని మా చివరిపిల్లకీ ముసలమ్మకీ పడ్డ తగూకి మధ్యవర్తిత్వం చేస్తున్నాను. ముసలమ్మ దిండుకింది పటికబెల్లం ముక్కలు ఎత్తుకుపోయితింటోందిమాచిట్టి తినకుండాఎట్లావుంటుంది అంటుందికోడలు. తినేస్తే పటికిబెల్లం దొరకటం లేదంటుంది ముసలమ్మ. పటికబెల్లంతో తప్ప ఏమందుకీ లొంగదు ఆమె దగ్గు. అందుకని తనకర్రతో గట్టిగా ఒకటి పెట్టింది మనమరాల్ని. సాయంత్రంలోపున ముసలమ్మని తాను యేమి చెయ్యదల్చుకుందో ముందే నోటీసు ఇస్తోంది చిట్టి-కాంగ్రెసు వాదిమల్లే. రెండువేపుల వాదనలోనూ న్యాయముంది. అట్లాంటప్పుడు ధీరుడైన యజమానికి ఒకటేమార్గం – పిల్లని రెండు వెయ్యడం, ముసలమ్మని నాలుగు చివాట్లు పెట్టడం. కాని నాలో అల్లాంటి ధీరత్వం చాలా తక్కువ. ఏ చిన్న విషయాన్నైనా శాంతిస్థాపక సంఘమల్లే చిక్కులుగా అనంతంగా విచారణ చేస్తాను. ఏంచేస్తే స్థిరత్వమూ లేకపోవడంవల్ల చివరికి నా తీర్పుని ఎవరూ పాటించరు. కాని ఫిర్యాదులు మాత్రం వొస్తూంటాయి నిరంతరంగా. నేను విచారణాపీఠాన్ని అధిష్టించకముందే బైట తలుపుదగ్గిర్నించి.

"జనార్దనంగారు వున్నారా?" అని ఎవరో పిలిచారు ఆ వచ్చిన మనిషిని దీవించుకుంటూ గబగబా బైటికి వెళ్ళాను.

ఆయన నాకు వూళ్ళో కనిపిస్తోనే వుంటాడు.

"తమరు సినిమా తీయిస్తున్నారటగా!"

"నేను కాదు లెండి తీయించేది. కాని నాకూ భాగం వుంది."

ఆ సినిమా వ్యవహారంలో ఎందుకు జోక్యం కలగజేసుకున్నానని ప్రశ్నించుకుంటే సమాధానంలేదు. ఎందుకు మీసాలు వుంచుకున్నావు? షర్టు ఎందుకు వేసుకుంటావు? బెండకాయలు ఎందుకు వండుకుంటారు? అన్నట్టే. ఎదో అందరూ చెయ్యటంలా? అందుకునే.

వొచ్చి కూచున్నాడు నన్ను డబ్బు పెట్టుబడి పెట్టమని. చిన్నప్పుడు నాతో చదువుకున్నాడు. మా క్లాసుకు అతను మానేటరు. రెండేళ్ళు మా టీచరుకన్నా మాపైన గొప్ప అధికారి అతను. ఈ పూజారికి కోపం వచ్చిందా. ఆ దేవుడు చాలా శిక్షలు విధించేవాడు. అణా శెనగపప్పు కోనుక్కుంటే అర్ధణాదిపైగా అతనికి ముట్టేది.

"ఈనాడు నీకు చాలా డబ్బుంది. దాంట్లో ఓ భాగం నా సినిమా యత్నానికి ఇచ్చెయ్యి" అంటే కాదనలేకపోయినాను. అన్ని లెఖ్ఖలూ చూపించాడనుకోండి-ఒక్కొక్క పెట్టుబడిదారుకి ఎంత గొప్ప గొప్ప అదృష్టాలు పట్టాయో! కాని ఆ లాభాల పుస్తకంలోనే వెనకపుట తిప్పితే దురదృష్టాల లెఖ్ఖలు అదృశ్యంగా వున్నాయనికూడా తెలుసు నాకు. కాని నా జాతకం చాలా అదృష్టమైనదంటున్నారు మొదటినించీ కూడా. మా వంటింటి పరిసరాల్లో తప్ప తక్కినచోట్ల నా ప్రతిభ అట్లానే వెలుగుతోంది ఈనాటికీ. మా డైరెక్టరు తాను తియ్యబోయే చిత్రం సంగతి మాట్లాడాడు కూడా. తనకి డబ్బు, కీర్తి ఇట్లాంటి తుచ్ఛ కాంక్షలు లేనేలేవనిన్నీ, తెలుగుదేశంలో గుంటపువ్వు పూస్తున్న సినిమా పరిశ్రమని ప్రపంచం కళ్ళ ముందు దేదీప్యమానం చేయ్యడమే, కళారాధనే తన ఆశయ మనిన్నీ, తన జీవితాన్ని యీ కళకు అంకితంచేసి, అవసరమైతే రక్తం ధారపోసి, తాను భస్మమై పోతాననీ, పతాకోత్సవంలో మల్లే నాముందు శపథం చేసుకున్నాడు. తాను తీయబోయే ఫిల్ములో యిదివరకు తెలుగు చిత్రాల్లో వుండే దోషాలు ఏమీ వుండవన్నాడు. ఆ ఫిల్ము పురాణమూకాదు. పాతకథా కాదు, చరిత్రా కాదు, సాంఘికం, రాజకీయం ఏదీ కాదు; అదొక విప్లవం అన్నాడు. ఆ ఫిల్ములో పాతివ్రత్యం, యుద్ధం, దేశభక్తి, దైవభక్తి,

సంస్కారం, నవీన రాజకీయ, సాంఘిక, ఆర్థిక విద్యావిధానాలూ వుంటాయిట.

"అంటే, కమ్యూనిజం ఔనా?"

"ఎబ్బే! అదీ కాదు."

"ఏదైనా విప్లవమయితే చూడరేమో మనుషులు?"

"కళా విప్లవం. అది చూస్తే ప్రజలు 'ఆహా! చిత్రాల్లో విప్లవం వొచ్చింది' అంటారు."

ఇదివరకు తెలుగుచిత్రాల్లో నాకేమీ లోపాలు కనిపించలేదు. అందు కని అతనితో తర్కించలేకపోయినాను.

"మరి ఇంతవరకు ఏం ఏర్పాట్లు చేశారు?"

"అన్నీ చేశేసాను. మీరు యీ కాయితాల మీద సంతకం చెయ్యా డమే తరువాయి."

"ఫిల్ము తయారయిందా? అయితే."

"అదేన్నాళ్ళు, రెండునెలలు "

ఫిల్ము చూడడమేగాని, అసలా బొమ్మలు ఎట్లా వస్తాయో కూడా నాకు తెలీదు. ఆ ఆలోచనే రాలేదు.

"ప్రతిదానికి కారణం వెతకడమే సయన్సు ఆదర్శం; కారణం వెతికే అలవాటు చేసుకోవాలి" అనేవాడు మా సైన్సు మేష్టరు. కాని నా కా అలవాటు కానేలేదు. మొదట్లో కొంత ప్రయత్నించాను చిన్నతనంలో. ఆ టీచర్నే "మా ఆవుకి దూడ ఎట్లా కలిగింది" అని అడిగితే తన్నాడు.

మా ముసలమ్మకి అంత మంకుతన మెందుకో. మా కోడి ఎందుకు గుడ్లు పెట్టకుండా అటకెక్కి కూర్చుంటుందో. బియ్యం ధర రెండు రూపాయ లెందుకు పెరిగిందో, ఎట్లా పెరిగిందో. పెంచేవా రెవరో, లేక

పొద్దున్న వెళ్ళి చూసేటప్పటికి అదే పెరిగివుండి ఎవరికన్నా కనిపిస్తుందో, ఒకరోజు గోంగూర పులుసుకూర ఎందు కమృతంలాగుంటుందో, ఇంకో రోజు సైడు కాలవలోంచి తోడి తీసుకొచ్చినట్లు ఎందుకుంటుందో ఇంత వరకు తేలలేదు. ఇహ లాభంలేదని కారణాలు కనుక్కునే యత్నంనించి పూర్తిగా విరమించుకున్నాను. మా సైన్సుమేస్టరు ఒకసారి కనపడితే బావుండును;

మా డైరెక్టరు యిదివరకటి తెలుగుచిత్రా లన్నీ ఉత్త చెత్త అన్నాడు. అవునుగావును.

"ఇంతవరకు మీరు చేసిన ఏర్పాట్లేమిటి?"

"కంపెనీకి పేరుపెట్టాను. చిత్రానికికూడా నాలుగైదు పేర్లు ఆలోచించాను. కథ రాయిస్తున్నాను. పాటలు తయారవుతున్నాయి. నటీనటకులు దొరికారు. స్టూడియో ఏర్పాటయింది...."

"వీటన్నిటికి ఎంత ఖర్చయింది?"

"అచ్చుకిమాత్రం యిరవై రూపాయ లయింది. ప్రయాణ ఖర్చులు నేనే పెట్టుకున్నాను."

"అదేమిటి? మీరు పెట్టుకోవడమేమిటి? వీటన్నింటికి అంత ఖర్చు చేసి!"

"రెండువేలయింది. తరవాత తీసుకుంటాను. తొందర లేదు. మరి త్యాగమంటే ఏమిటి?" అన్నాడు.

"వాళ్ళందరికీ డబ్బు యిచ్చి మీరు తీసుకోనేలేదా?"

"ఎవరికీ ఏమీ ఇవ్వందే!"

"మరి ఆ కవికీ, కథకుడికీ, స్టూడియోకీ?"

"కవికీ, కథకుడికీ ఏం ఇవ్వనక్కర్లేదు. తరవాత ఏదో ముట్ట చెపుతాము. నటీనటుల దగ్గర్నించి నేను బజానాలు తీసుకున్నాను. స్టూడియోలూ అవీ అన్నీ చూసి, చిత్రం తీయడానికి వొస్తానని చెప్పి వచ్చాను."

"ఆ పని ఎవరైనా చెయ్యవొచ్చునుగా?"

"కాని గొప్ప డైరెక్టరు వెళ్ళి చూడ్డం వేరు."

చాలా పొదుపైనవాడు. నా డబ్బు యితనిచేతుల్లో చాలా జాగ్రత్తగా వుంటుందని అతనిలో చాలా విశ్వాసం కలిగింది నాకు. కాని పాపం ఆ కవుల్నీ, నటకుల్నీ తలుచుకుంటే కొంచెం జాలివేసింది. పాపం వాళ్ళ కోసమయినా నేను డబ్బు సహాయం చేయాలి.

"ఎంత అవుతుంది ఫిల్ముకి?"

"రెండు లక్షలు."

"మరి తక్కిన డబ్బు?"

వాళ్ళెవరో వుంటారట డిస్ట్రిబ్యూటర్లని. వాళ్ళు ఫిల్ము రాజ్యంలో కుబేరుల్లాగూ, దానకర్ణుల్లాగూ వున్నారు. ముందుగా వాళ్ళు డబ్బు ఇవ్వరట. కొంచెం డబ్బు కనపర్చి, ఫిల్ము తీస్తామని పత్రికల్లో ప్రకటిస్తే చాలు కావలసిన డబ్బంతా పెట్టుబడి పెడతారుట. నీళ్ళు తోడేపంపులాగున్నారు వీళ్ళు. కొంచెం నీళ్ళు పోస్తే చాలు కావలసినన్ని నీళ్ళు తోడుకోవొచ్చు. వాళ్ళు యీ ఫిల్ము పరిశ్రమని ఉద్ధరించడానికికని. డబ్బుమూటలు ముందు పెట్టుకుని ఎవరు ఫిల్ము తీస్తామంటారా, ఈ డబ్బు ఎవరి కిద్దామా అని ఎదురు చూస్తూ రాత్రింబవళ్ళు వీధి అరుగులమీద కూచునివున్నట్టు కనపడ్డారు నాకు. ఎమో! నే నేం లోకం చూశాను? ఉంటారు కాబోలు అంత ధర్మాత్ములు! తక్కిన పరిశ్రమలకి కూడా అట్లాంటి పరోపకారపారీణులు కొందరన్నా వుండకూడదా! కాని అన్నిటికి ఎందుకు వుంటారు? ఫిల్ముపరిశ్రమ వేరు. దాంట్లో మరి న్యాయం, కళ, స్వార్థరాహిత్యం, ప్రజాబోధ, సేవా అన్నీ వున్నాయయ్యేను.

"మీ కా ఫిల్ములు తియ్యడం బాగా తెలుసునా ఏం? మొన్నటిదాకా ఏవో సభలో తిరుగుతూవుంటిరి?"

"తెలీడానికేముంది? అదీగాక చచ్చిపోలా మా షడ్డకుడు—అతను రెండువారాలపాటు ఓ స్టూడియోలో కాఫీహోటలు పెట్టాడు. రెండు

మూడుసార్లు ఒకస్టూడియోలో మా జాతి మహా సభలు కూడా పెట్టించాను. నాకు చాలా అనుభవం" అన్నాడు.

తక్కిన వ్యాపారాల్లో అనుభవానికీ, ఫిల్ము విషయానికి ఎక్కడా పోలికలేదు. అవును ఫిల్ముపీల్డే వేరయ్యేను! అంతే అన్నాడు మా డైరెక్టరు కూడా.

"అదీకాక కవిమల్లేనే డైరెక్టరై పుట్టాలిగాని అది నేర్చుకుంటేవచ్చేది కాదు."

అవును, అతనట్లానే పుట్టినట్లు కనిపించాడు. లేకపోతే ఆ మహా కవులూ, స్టూడియో దొరలూ, గొప్ప నటకులూ ఇతన్ని ఎందు కంత నమ్ముతారు?

అతని చేతికి చాలా మొత్తానికి చెక్కురాసి యిచ్చాను. వారం రోజుల్లో పత్రికల్లో అతని పేరుతో పెద్దపెద్ద ప్రచురణలు వొచ్చాయి— ఫిల్ము విప్లవం! చిత్రమహారాజం. ఉత్తమోత్తమతురీయ మహా సంచలనం. కని, విని, ఎగిరి, ఎరిగివుండని మహా మేయ సృష్టి!! అని. అంతే తెలుసు నాకు ఆ ఫిల్ము సంగతి.

నాలుగు నెలలయింది. ఆపాటికి ఫిల్ము పూర్తి అయిందనుకుంటు న్నాను. ఇంతలో ఓ పెద్దమనిషి వచ్చి

"తమరు నాకో సహాయం చేసి పెట్టాలి. నా కుమార్తెకు చిన్నప్ప ట్నుంచీ ఫిల్ముల్లో పాత్రధరించాలని గొప్ప కుతూహలం" అన్నాడు.

ఆ అమ్మాయి చిన్నప్పుడు మా యింటికి వొచ్చేది. చురుకైన పిల్ల, అందమైన పిల్ల. చక్కని పాటలు పాడేది. నాకే కొడుకు వుంటే, ఇట్లాంటి పిల్లని కోడలుగా చేసుకునేవాణ్ణి కదా అనుకునేవాణ్ణి.

"అందుకోసమే బతికిందనుకోండి. సంగీతం, డాన్సు, అన్నీ నేర్చు కుంది. నాలుగేళ్ళు చాలా కృషిచేసింది. దాని కిప్పుడు పదిహేడేళ్ళు. పెళ్ళి చేసుకోనని చాలా గట్టిపట్టు పట్టింది. పెళ్ళి చేస్తే చస్తానంది. చెయ్యకపోతే చస్తానంది నా భార్య."

"నీకూ వున్నాయా యిట్లాంటి సమస్యలు."

"ప్రతియింటా వున్నాయి."

"ఏం చేశావు?"

"ఇద్దర్నీ తన్నాను."

"తీరిందా?"

"తీరలేదు· నా చేతులు కాయలు కాశాయి. వాళ్ళ వీపులకి దెబ్బ తగలడం మానేసింది. చివరకి ఆరునెలల్కింద ఎట్లాగో వొప్పించి పెళ్ళి చేశాం. మనవూళ్ళో పురుషోత్తం లేడూ, బట్టలదుకాణం, ఆయనకి. తమకూ శుభలేఖ పంపుకున్నాము. ఇప్పుడు మళ్ళీ ఫిల్ములో చేర్పిస్తావా చస్తావా అని కూచుంది."

"ఏం? మొగుడు వొదిలేశాడా?"

"ఎబ్బే! ఎందుకు వొదిలేస్తాడు?"

"తిప్పలు పెడతాడా?"

"అదేం లేదండీ! పెళ్ళయ్యాక చేర్పిస్తాలే అన్నానండి బుద్ధిలేక. చేర్పిస్తావా నూతిలో దూకనా అని కూచుంది."

"మొగుడు ఏమంటాడు?"

"అతనితో చెప్పినట్టులేదు. వినకేం చేస్తాడు లెండి. మా అమ్మాయి అంటే చాలా ప్రేమ అతనికి. ఇది మాత్రం మొగుణ్ణి వొదిలేసుకుంటుంది గాని, సినీమాని వొదులుకునేట్టు లేదు."

"సరే చూద్దాం; తొందరేం? మళ్ళీ ఫిల్ము మొదలు పెడితే."

"తొందరేమంటారేమిటి? అది మొగుడితో కాపరం మానేశింది."

"ఎందుకు?"

"పిల్లలు పుడతారని. కడుపువొచ్చినా, పిల్లలు పుట్టినా చిత్రాలలో చేర్చుకోరుటగా? అవునా?"

"నాకేం సినిమా సంగతులు తెలీవు. నేను డబ్బు పెట్టాను. ఫిల్ము

పూర్తికాగానే అన్ని వూళ్ళల్లోను చూపుతారట. చూసి నా డబ్బుకి నాలుగింతలు లాభాలు తెచ్చి మా వాకిట్లో పోస్తానని చెప్పాడు."

"మీరు వెళ్ళనే లేదా?"

"నా కేం పని! వొస్తానంటే, మీ కా శ్రమ ఎందుకు, అన్నాడు మా డైరెక్టర్."

"పోనీ, ఆయనకి ఓ ఉత్తరం రాసి ఇస్తే మా అమ్మాయి వెడుతుంది."

"ఇప్పుడా? ఫిల్ము పూర్తి అయివుంటుంది కదా?"

"ఫిల్ము పూర్తికావడమేమిటి? నటీనటకుల్ని దరఖాస్తులు పెట్టుకోమని ప్రకటన చేస్తేనే!"

"అది మా కంపెనీ అయివుండదు. మాది Cine Miracle-Makers. వాళ్ళ ప్రచురణ పత్రికల్లో లేందే."

"పేరు మార్చుకున్నారు మా అమ్మాయి అన్నీ కనిపెడుతూనే వుంది. చాలా తెలివి గలది వాళ్ళిప్పుడు Super-Film wonder-workers అనే పేరు పెట్టుకున్నారు."

"ఇన్నాశ్చేం చేస్తున్నారో! రెండు నెలలలో చిత్రం వస్తుందన్నారు. సరేలెండి. ఉత్తరం ఇస్తాను. ఇంకా ఫిల్ము పూర్తయిందనుకున్నాను."

"గట్టిగా రాయాలి. నేను, మా అమ్మాయి యింత ఖర్చు పడి కలకత్తాదాకా వెళితే తీరా నిరాశ అయితే!"

"కలకత్తా ఎందుకు?"

"అక్కడ తీస్తారుట. ప్రకటన అక్కణ్ణించే వేయించారు."

"అయ్యో! అంతదూరం వెళ్ళాలా మీరు! పోనీ ముందు ఉత్తరం రాసి కనుక్కుంటాను. తీసుకునేట్టుంటే వెళ్ళవచ్చు."

ఆ ప్రకటనా, కవరు, కాయితం తెచ్చి నాచేత నా మిత్రుడికి గట్టిగా వ్రాయించాడు. అయిదోనాటికి నా డైరెక్టర్ ప్రత్యక్ష మైనాడు.

"అప్పుడే ఎట్లా వచ్చారు కలకత్తానించి?"

"కలకత్తానించి రాలేదు. ఆ వుత్తరం రీ డైరెక్టయింది."

"మరి కలకత్తాలో చిత్రం తియ్యటంలేదా?"

"ఇంకా తియ్యటంలేదు. తీస్తున్నామన్న మాటే."

"మరి కలకత్తాలో ఏం చేస్తున్నారు? డబ్బు చాలా పొదుపుగా వాడతామన్నారు."

"అసలు కలకత్తా వెళ్ళలేదు. అట్లా ప్రచురిస్తేనేగాని డాబుగా వుండదు; డిస్ట్రిబ్యూటర్లు నమ్మరు."

"మోసం కాదా?"

"మోసమేముందీ? ఏమో! అక్కడే తియ్యకూడదా?"

"మరి స్టూడియో మాట్లాడుకున్నామన్నారు?"

"మాట్లాడుకున్నాం. పోనీ, కలకత్తాలో మాట్లాడుకుందాం. మాటల కేముందీ? డబ్బు యిచ్చినప్పుడు కదా?

"ఫిల్ము ప్రారంభించనే లేదా?"

"ప్రారంభిస్తున్నాము. ఎన్ని చిక్కులు! మంచి కథ దొరకలేదు. తిరుగుతున్నాం. అందరు నటులూ బుక్ అయిపోయినారు. అందుకే ప్రకటన వేయించాముగా!"

"మరి ఈ అమ్మాయిని చేర్చుకుంటారా?"

"చేర్చుకోకేం? మీరు చెప్పిం తర్వాత కూడానా?"

"నేను చూడలేదు. అందంగా వుంటుందో...."

"ఏం పరవాలేదు. అందంగా మేకప్‌చేస్తాం."

"నటించగలదో లేదో!"

"ఒకరికి నటించడం చాతనవునా ఏమిటి? ఫరవాలేదు."

"పాట పాడుతుందిట."

"పాట ముఖ్యమే కాదు. ఎవరిచేతనైనా పాడిస్తాం."

"అయితే ఈ వెతకడ మెందుకు? చుట్టుపక్కలవాళ్ళని కొందరిని పోగుచేసుకు పోకూడదూ?"

"అట్లా చేస్తే విలువ ఏముంటుంది? అదే తీరా చేసేపని. కాని ఏదో కష్టపడి వెతికి, టెస్టుచేసి తీసుకుంటే, వాళ్ళకి, ప్రజలకి కూడా చాలా గొప్పగా వుంటుంది." అని ప్రస్తుతపు ముఖ్య తారల ఆంతర్య వివాహాలు, అసలు అందాలూ, మాటలూ, తెలుపుతూ ప్రసంగించాడు.

ఆ అమ్మాయిని పిలిపించాను. ఆ అమ్మాయి వచ్చేలోపున మా డైరెక్టర్, తన మొహం షోకుచేసుకుని, సూటు గీటు వేసుకుని, కుర్చీ టేబిల్ పెట్టుకుని, కొన్ని పుస్తకాలూ, కాయితాలూ, కలం (అన్నీ నావే) అమర్చుకుని, నా చేతిగడియారం తీసి, బల్లమీద పెట్టి, ఒక గ్లాసులో సోడా మొదలైనవి పెట్టుకుని తయారైనాడు.

ఆ అమ్మాయి ఆ పూట రానే లేదు. సాయింత్రం వచ్చింది. మళ్ళీ ఈయన ఆ విధంగానే తయారైనాడు. ఆమెని బైట నుంచో పెట్టి చేతి రుమాలుతో ఒకటే విసురుకుని తుడుచుకుంటున్నాడు. ఆ అమ్మాయిని కూచోమనన్నా అనలేదు. ఆ పిల్ల అందమయిందే. ముందు ఇటునించీ అటునించీ నా సులోచనాల జోడులోంచి ఆమెని పరీక్షించాడు. చేతులెత్త మన్నాడు. నడుం వొంచమన్నాడు. నడవమన్నాడు. పరిగెత్తమన్నాడు.

అతడు నా స్నేహితుడు మల్లే లేడు. పెద్ద మిలటరీ ఆఫీసరు మల్లే అయినాడు. అతన్ని మాట్లాడించడం నాకే భయంవేసింది. ఆ అమ్మాయిని అట్లా నుంచో పెట్టి ప్రశ్నలు వేశాడు.

"ను వ్వే ఫిల్ములు చూశావు?"

"ఏ ఫిల్ములు యిష్టం?"

"ఏ తారలు నీకు నచ్చుతారు? ఎందుకు?"

"నీకు ఏ వేషాలు వెయ్యాలని కుతూహలం?"

అంటో సినిమా పరిశ్రమ ఆదర్శం మీదా, ఔన్నత్యం మీదా, కళారాధన మీదా, జీవితాన్ని అంకితం చెయ్యడం మీద, పెద్ద లెక్చరు ఇచ్చాడు. పాపం - ఆ పిల్లా, తండ్రీ చివరికి నేనూ ఆశ్చర్యచకితులమై భక్తి శ్రద్ధలతో విన్నాము. మళ్ళీ ప్రశ్నలు వేస్తో, ఆమె జవాబులు వింటూ అవన్నీ రికార్డు చేసుకుంటున్నట్టు రాసుకుంటున్నాడు నా వుత్తరాల కాయితాలమీద.

"నీకు పోతనలో ఏ ఘట్టాలు నచ్చాయి?"

"దేవతలో? పంతులమ్మలో? డాక్టరులో? జీవన్ముక్తిలో? బాల నాగమ్మలో?....." ఇట్లా.

"బొబ్బిలియుద్ధం యింతవరకు ఫిల్ము ఎందుకు తీయలేదంటావు? తీస్తే డబ్బు వస్తుందంటావా? డాక్టరు సుబ్బారావు వెంగళరాయుడుగా పనికివొస్తాడా? సుందరామయ్యగారు బతికి వుంటే పాపారాయుడుగా బావుండేవాడా?"

ఆ అమ్మాయి పాపం అదిరిపోయింది.

చివరికి "నీకు ప్రేమా, శోకమా, ఏది ఇష్టం నటించడం?"

"ప్రాతివ్రత్యం"

"మంచిమాట అన్నావు. పాతివ్రత్యం ఫిల్ములో లేంది డబ్బు రాదు" అని పాతివ్రత్యమహిమమీదా, హిందూస్త్రీల ఆధిక్యత పైనా, సీతా, దమయంతీ, సావిత్రులమీదా లెక్చరుకొట్టాడు. ఎట్లా ఏ ఏ డైరెక్టరు పతివ్రతా పాత్రలని తగలేశాడో చెప్పాడు. "ఈ కాలంలో పాతివ్రత్యం కొన్ని చీలికలుగా ఏర్పడ్డది. నచ్చిన భర్తతో కష్టాలుపడడం, నచ్చని భర్తతో కష్టాలు పడడం, ముసలి భర్తలతో, బాల భర్తలతో, పసికూన భర్తలతో— పాము, తేళ్ళు మొదలైన భర్తలతో— నీ కెలాంటి భర్తతో కష్టాలుపడడం ఇష్టం?"

"దేవతా భర్తలతో"

"అవును, వాళ్ళని మరిచిపోయినాను. బాగా చెప్పావు."

"చాలా తెలివై నదండీ."

"సరే, పది ఫోటోలు తీయించి పంపండి."

"పదా?"

"ఎదురు, వాలూ, ఈ పక్కా, ఆ పక్కా, వెనకా, నెత్తిపైనించీ, గడ్డం కిందినించీ, కాళ్ళసందునించీ, తలకిందులుగా, చంకల మధ్యగా" అని సభ చాలించాడు. ఆ అమ్మాయి వెళ్ళేటప్పుడు "మేము ఇంటర్వ్యూకి పిలుస్తాము. అప్పుడు మీ ఖర్చుమీదనే రావాలి."

"కలకత్తాకా?"

"స్థలం తెలియజేస్తాము" అన్నాడు

ఆ రాత్రి నన్ను కూచోబెట్టి ఫిల్ము ఆలస్యం కావడానికి అనేక కారణాలు చెప్పి వాళ్ళనీ వీళ్ళనీ బూతులు తిట్టి, ఇంకో పదివేలు ఇవ్వడానికి వొప్పించుకున్నాడు. నా మనసులో మట్టుకు ఆ అమ్మాయిమీద దిగులుపట్టుకుంది.

"మళ్ళీ పాపం ఇంకో యింటర్వ్యూ ఏమిటి? అయింది చాలదా? ఆ అమ్మాయిని తీసుకుందురూ!" అన్నాను.

"మరి, చెప్పరేం సంగతి. అదెంత? తీసుకుందాం. పిలిపించండి."

"మరి, ఆ గొడవంతా ఏమిటి?"

'అరే! అట్లా చెయ్యకపోతే తేలికై పోమూ?'

ఆ రాత్రే పిలిపించాను మళ్ళీ.

మళ్ళీ ఆ పిల్లని అదరకొట్టి "ముద్దెట్లా పెట్టుకుంటావో గాలిలోకి చూపించు, మీ నాన్నని కావలించుకో, ఏడు, కోప్పడు" అని యిల్లాంటి వన్నీ చేయించి, ఏవో షరతులు రాసిన కాయితం చూపి సంతకం చెయ్యమన్నాడు ఆ కాయితంలో నేను చూసినమట్టుకు ఏం చెపితే అది చెయ్యాలనీ, ఎప్పుడు రమ్మంటే అప్పుడు రావాలనీ, ఎక్కడకైనాసరే, ఎంత కాలమైనా సరే— ఇల్లాంటి నిబంధనలున్నాయి. మళ్ళీ ప్రశ్నలు వేశాడు.

"వితంతువులు వివాహం చేసుకోవాలా కూడదా?"

"కూడదు."

"భార్యలు సహగమనం చెయ్యాలంటావా?"

"చెయ్యాలి."

"పల్నాటియుద్ధంలో సహగమనం చూసినవుడు నీ భావాలెట్లా వున్నాయి?"

"భయమేసింది."

"కాలిపోతుందనా? అది ఉత్త ఫిల్ముకదా!"

"అందుకు కాదు, నాతో స్వర్గానికి కూడా వస్తుందిట అని ఆ పీనిగ లేచి పరిగెత్తుతుందని "

"చాలా హ్యూమర్ వుందండీ!....మరి ఏ కష్టాలు యిష్టం నీకు? దైవం పెట్టే కష్టాలా? భర్త పెట్టే కష్టాలా?"

"రెండూను."

"మంచిది, ఎంత జీతం కావాలి?"

"మీ యిష్టం."

"అయిదువంద లిస్తాను సంతోషమేనా?"

"అయిదువందలే!" అన్నాను నేను.

"అదేమిటండీ! ప్రసిద్ధ తారల జీతాలు ఎంతెంతో తెలుసా? మన ఫిల్ముకి పేరు ప్రతిష్టలు వుండాలా? బిచ్చం.రకంగా వుండకూడదు?"

ఆ అమ్మాయి సంతోషానికి మేరలేదు.

వెళ్ళేప్పుడు "అడ్వాన్సు అడగరేం?" అన్నాడు.

"అడ్వాన్సు మా దగ్గిర ఏమీలేదు, బీదవాళ్ళం."

"అది కాదమ్మా! మేమే ఇస్తాం! ఇక్కడ సంతకంపెట్టు."

అని నా డబ్బు రు. 500 వందలు తీసి ఉదారంగా ఇచ్చేశాడు ఆమెకి.

"కాల్ వొస్తుంది రిహార్సల్సుకి, సిద్ధంగా వుండు, వెళ్ళు" అన్నాడు.

★ ★ ★ ★

వారం రోజుల తరవాత ఆ అమ్మాయి భర్త వొచ్చాడు చాలా కోపంగా.

"ఏమిటండీ ఇది? పెద్దలు మీరే ఇట్లా చేస్తారని నమ్మలేక పోయినాను. నా భార్యని సినిమాలకి పంపిస్తున్నారటగా?"

"ఏమిటి! ఇంత గ్రంథం నీకు తెలీకుండానే జరిగిందా!"

"కాక ఏదో విన్నాను చూచాయిగా. వొట్టి దాని పిచ్చి అనుకున్నాను. కాని అంతా నిజమేటగా!"

"నేనేం చేశాను? ఆ అమ్మాయి చేరతాననీ, చేర్పించకపోతే నూతిలో పురుకుతాననీ అంటే, నా కేదో తెలిసిన వాళ్ళుంటే వాళ్ళకి చూపించాను. నీకు తెలీకుండా యింత పని చేస్తోందనీ, నీకు యిష్టంలేదనీ నాకేం తెలుసు?"

"ఇప్పుడు తెలుసుకున్నారుగా! మాన్పించండి."

"నేను మాన్పించేదేమిటి! నీ భార్య వెళతానంది, వాళ్ళు రమ్మన్నారు. నువ్వు నీ భార్యతో మాట్లాడి మాన్పించాలిగాని, నేనేం చెయ్యను? అదీగాక ఏవో కాయితాలమీద సంతకం పెట్టింది, కంఠం పట్టుకుంటాయి"

"మాన్పించడం నా తరం కాలేదు."

"భర్తవైన నీ తరమే కాకపోతే, ఇంక నా తర మవుతుందా? వీళ్ళు కాకపోతే యింకో సినిమా వాళ్ళు తీసుకుంటారు. అందమైన పిల్ల."

"మరి యిప్పుడేం చెయ్యమంటారు?"

"నేను చెప్పేదేమిటి?"

"అంతేలెండి. చేర్పించేవరకే మీ వొంతు. నా భార్యకి పూచీ పడతారా? ఇన్నేళ్ళొచ్చి, పెద్ద మనుష్యులై వుండి ఓ యింటి కాపరం యిట్లా పాడుచెయ్యడానికి మీరు వెనుదియ్యలేదంటే నే నింక అనేదేముంది?"

"అప్పుడే ఏదో కొంప కూలిపోయినట్లు గోల చేస్తావెందుకు? ఇప్పుడు కాలమంతా మారిపోతూంది—కనపడటంలేదా నీకు? ఆడవాళ్లు చదువుకుంటున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. వాళ్ళ కాపరాలు కూలిపోయినట్లేనా?"

"సరేలెండి, ఇష్టమైన వాళ్ళని ఏమన్నా చేసుకోనీండి. వాళ్ళ భర్తల ఇష్టం. వాళ్ళ యిష్టం. అనేకరకాల భర్తలు వున్నారు. నా కెందు కవన్నీ. నా కాపరంలో నా భార్య సినిమాల్లో చేరడం వొప్పుకోను."

"అప్పుడే చేరిందా? చేరితే నేం పుట్టి మునిగిపోయింది?"

"ఏం మునిగిపోయిందో! మీ భార్యో, కూతురో చేరితే ఏమనేవారో."

"ఏమంటాను. అంత భయమైతే వెంటపోతాను. అంతేగాని అన్నిటికీ తెగించి చస్తామని కూచున్న వాళ్ళని నేను మాత్రం ఏం చేస్తాను? కావలిస్తే నువ్వా నీ భార్యవెంట వెళుదువుగాని."

"ఏమిటీ, నా షాపు మానేసుకుని-బాగావుంది!"

"ఏదోలే. కాని అప్పుడే అంత గాభరా ఎందుకు?"

"ఎందుకేమిటి! దాని కప్పుడే పిచ్చి పుట్టింది. ఏవో పది ఫొటోలట! నుంచునీ, వొంగీ, పడుకునీ, చీరతోనూ, చీరలేకుండానూ...."

"ఛీ! ఛీ! వూరుకో."

"అంతేనండీ, దానికి ఫొటో లేమిటండీ! రేపు ఏ గోడమీద చూసినా దీని మొహమేగా! దాని రూపమే మారిపోయింది. బజానా యిచ్చారటగా? అవేవో తలముందు కట్టుకునే చాటలంత బిళ్ళలూ, చెవులకి చక్రాలంత లోలకులూ చేయిస్తోంది, కంసాలాయన్ని సినిమాహాలుకి తీసికెళ్ళి పక్కన కూచోపెట్టుకుని మాదిరీలు చూపి. దాన్ని గుర్తుపట్టలేము; నెత్తిమీద విసిని కర్ర మల్లె పూలు. ఏవో పోజులుపెట్టి, ఆలోచించి కళ్ళుతిప్పి, మూతి విరిచి మాట్లాడుతోంది. దాని పేరు జగన్మోహినట. 'సుందరా కారా, మారా' అంటో పాడుతూ నామీదికి వొస్తుంది. ఎట్లానండీ యింట్లో భరించడం?"

నాకు నవ్వు వొచ్చేసింది. పాపం!

"నువ్వు వూరుకున్నావా?"

"బాగా తన్నాను. తంతే ఏంలాభం?"

"హా, మనోనాధా! నీవే నా దైవం. నేను ప్రతివ్రతా తిలకాన్ని. హా! కృష్ణా! ద్రౌపదీ మానసంరక్షణా!' అని అరిచింద. 'ఇంకా తన్నండి. నా పాతివ్రత్యం ప్రపంచానికి వెళ్ళడి చేస్తాను - సక్కుబాయిమల్లే. ఇప్పుడు మా డైరెక్టరు వుంటే బావుండును' అంది.

"అదేదో ఫిల్ములో కుష్టువాణ్ణి భార్య మోసిందిట. నన్ను భుజాల మీద ఎక్కమంది. అదేదో ఫిల్ములో భర్త పసిపిల్లవాట్ట. నన్ను వాళ్ళో

పెట్టుకుని పాలివ్వబోయింది. నేను లేనప్పుడు బొమ్మకు పాలిస్తోంది. ఇంక దాన్నేం తన్నను?"

'చూశారా! నా యిల్లు ఏమైపోయిందో! పైగా పిల్లలు పుడతారని, వేరే గదిలో పడుకుంటూంది.'

"ఎందుకు ఒప్పుకున్నావు?"

"దానికి పిచ్చి, ఏంచెయ్యను? బిగ్గరగా ఏడుస్తుంది, మానభంగం చేస్తున్నాడో అని, ఇప్పుడు ఒక సేఫ్టీరేజరు కొంటోంది.

"అదేమిటి?"

"కనుబొమ్మలు గొరుక్కుంటుందిట."

ఇంక నవ్వు ఆపుకోలేక లోపలికి పరిగెత్తాను. ఎప్పుడు వెళ్ళిపోయి నాడో వెళ్ళిపోయాడు అతను-పాపం.

ఆ అమ్మాయికి కబురు పంపాను. ఆమెతో మాట్లాడిం తరవాత సాధారణంగా అందరికీ కొంచెమో గొప్పో ఎత్తిన పిచ్చే కొంచెం అధి కంగా డోజు పడ్డదనుకున్నాను. చక్కగా మామూలుగానే మాట్లాడింది. ఆమె భర్త ఫిర్యాదు కొంతవరకు చెప్పాను. నవ్వింది.

"ఏం లేదండీ ఇప్పటినించీ నటన ప్రాక్టీసు చేసుకుంటున్నాను, ఆయనకి మరీ అంత బాద స్తమయితే ఎట్లా?"

"మరి, ఆయనతో చెప్పకుండా చేరావుట "

"పతివ్రతలు అంతేకదండీ!"

"అంటే?"

"మొగుడు వొప్పుకోడు, మూర్ఖుడు గనక. పర్యవసానంలో తెలుస్తుంది ఎంత వివేకవతో భార్య."

"అతనిమీద నీకు యిష్టమూ, దయా లేవా?"

"చాలా యిష్టం. చాలా మంచివారు."

"అయితే యీ సినిమా గొడవ ఎందుకు?"

"అయ్యో! అది వీల్లేదు. ఆయనకి చెప్పి నమ్మించండి. అక్కడ నన్నేదో చేసేస్తారనుకుంటున్నారు. ఒక్క ఫిల్ముకి వెళ్ళి సరదా తీర్చు కుంటాను, అంతే తమ ధర్మాన ఇంతవరకు నెగ్గిం తరవాత ఇంక తగ్గడమా? అదిగాక ఆ పెద్దమనిషికి ఖరారు నామాకూడా వ్రాసి ఇస్తిని. నన్ను తెరమీద చూస్తే ప్రజలలో ఆయనకి ఎంత గౌరవం, ఎంత కీర్తి."

"ఆయన అట్లా అనుకోటంలేదు. నీకు పిచ్చి అనుకుంటున్నాడు. నిన్ను విడిచి ఇంకో పెళ్ళి చేసుకుంటాడేమో?"

ముందు దిగులువొచ్చింది మొహంలోకి. తరవాత సంతోషం వచ్చింది.

"చేసుకోనీండి. నాకేం? మళ్ళీ వొచ్చి ఆయన భార్యగా సేవ చేసుకుంటూవుంటాను."

అట్లా జరిగిన ఇద్దరిద్దరు భార్యలు వున్న ఫిల్ముల పేర్లూ, నిజమైన సినిమావాళ్ళ పేర్లూ చెప్పింది.

"ఇప్పుడు చదువుకున్న ఆడవాళ్ళంతా రెండో భార్యలుగా వుండడం ఫాషను కదండీ!" అంది పైగా.

★ ★ ★ ★

అటుతరవాత నాకు జబ్బుచేసి మద్రాసులో ఆరునెలలు కాపరం పెట్టాల్సివొచ్చింది. బతుకు చావులమధ్య నా ఫిల్ము ఏమయిందో నాకు ఒకసారన్నా ఆలోచనకి రాలేదు. నయమయి నా వూరు చేరుకున్నానో లేదో, ఆనాడే వొచ్చాడు, చాలా గంద్రగోళంగా ఆ పిల్ల తండ్రి.

"కొంప మునిగింది బాబూ, నా కొంప తీసేశారు, మీ సినిమా మీరూనూ."

"ఏమిటి సంగతి!"

రహస్యంగా అన్నాడు "మా దానికి కడుపు"

"అయితే దానికింత రహస్యమెందుకు?"

"సినిమాకి పోయి తెచ్చుకుంది!"

"వెళ్ళిందా సినీమాకి! తీశారా ఫిల్ము!" నా ఆశ నాదీ-

"తీయలేదు, ఏంలేదు. దీనికిమాత్రం కడుపు తెప్పించారు!"

"మొగుడున్నాడుగా!"

"వుంటేనేం? అతనిదగ్గిర పడకలు లేవుగా!"

"ఏమంటుంది, మీ అమ్మాయి?"

"ఏమంటుంది? మాటాడకండా మూల కూచుంటుంది. ఏం చెయ్యమంటారు?"

"అసలే నా జబ్బుతో చస్తున్నాను, ఇదేం గోలయ్యా నాకు?"

"మీరు తెచ్చిపెట్టిన గోలే."

"ఓసారి మీ అమ్మాయిని రమ్మనండి; తరవాత ఆలోచిద్దాము."

వొచ్చింది మధ్యాహ్నం. వేషాలన్నీ వొదిలిపోయినాయి. మామూలుగావుంది. లాలించి కథ అంతా లాగాను.

కాల్ వొచ్చిందిట. భర్తకి తెలీకండా వెళ్లిందిట. తండ్రి కూడానే వెళ్ళాడు భర్త వెనక పరిగెత్తుకొచ్చి తగూలాడితే, ఆ సినిమావాళ్లు బెదిరించి పంపించేశారు. పోలీసులతోటి చెప్పినా, వాళ్ళుమాత్రం ఏం చెయ్యగలరు!

తరవాత రిహార్సల్సు ప్రారంభించారుట. ఆ డైరెక్టరే హీరో! మొదట ఇంటోనే బాగా ప్రేమసీనులు చేయించారట. తరవాత అవుట్‌డోర్ సీన్లు రిహార్సల్సు, చెట్టుకింద పడుకోడాలు, నీళ్ళల్లో యీమె పడితే అతను యీది పైకి తీయడాలూ, మూర్ఛపోతే బుజంమీద మొయ్యడాలూ, ఇట్లాంటివి. తరవాత రాత్రుల్లో వెన్నెల రిహార్సల్సు, పాటలూ, విరహాలూ, రహస్యంగా కలుసుకోడాలూ, అడవిలో దారి తప్పిపోవడాలూ, గుర్రాల

మీద ముందు కూర్చోపెట్టుకుని పారిపోవడాలూ, తరవాత ఒంటిగా పోయి రిహార్సల్సు చేస్తే యీ కడుపు వొచ్చిందిట.

తండ్రిని వెంట రానిచ్చేవారుకాదట. అనుమానం తగిలి తీసుకొచ్చేశాడు. అప్పటికే మూడునెలల గర్భం.

ఆలోచించి నాకు జబ్బు ఎక్కువయిందని ఆ అమ్మాయిని తీసుకొని మద్రాసు వొచ్చేశాను. ఫిల్మ్‌కి పెట్టుబడికాక నా కిదో ఖర్చు.

★

## తరుణాల చిత్తంబు....

స్టూడియో కేఫ్‌లో కూచుని వున్నారు వెంకుబాబూ, జాలయ్యా పకోడీలు నములుతో. దూరంనించి ఆర్కెస్ట్రా వినపడుతోంది. మూడు వందలోమాటు ఆ పాడు పాటని వాయిస్తో....

"వలపుల వేడుకవాడు
నా జోలికి ఇకనేమో రాడూ.
కొవ్విన కోయిలా పాడూ
చందమామా ఆఆఆ" అంటో.

"ఆ కిటికీ మూసెయ్యరా, ఇంక వినలేను ఆ పాట" అన్నాడు జాలయ్య.

"రేడియో తిప్పవయ్యా" అన్నాడు హోటల్ ఆయన్ని దాంటోంచి.